క్లుప్తంగా

నేడు మద్దిరాలకు ఎమ్మెల్యే రాక

మద్దిరాల : మండలంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిల మల్లు యాదవ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, ముకుందాపురం గ్రామంలో సీసీ రోడ్ల ప్రారంభం, తూర్పుతండాలో నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభించనున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్, లింగయ్య, శ్యామ్‌రెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్, ఎల్లేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

అర్వపల్లి : ప్రతి రోజు ధ్యానం చేయడంతో ఆరోగ్యం చేకూరుతుందని సూర్యాపేట హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎం.వెంకట రంగారావు అన్నారు. అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్రమిషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రోజు ధ్యానం చేయడం వలన అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభ్యాసకులు మేకల సత్యనారాయణ, ఉమ, స్వరూప, మనుబోతుల వీరయ్య, రాగి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

పెన్‌పహాడ్ : ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు 420హామీలు ఇచ్చారని అందులో ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయకలేకపోయారన్నారు. గోదావరి జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

నూతనకల్ : రైతులకు యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ రైతులు కష్టపడి సాగు చేసిన పంటలకు సమయానికి అందించాల్సిన యూరియాను అందించలేదన్నారు. దీంతో పంటల దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్ రెడ్డి, రవి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



వెలుగుపల్లిలో వెంకన్నను పరామర్శిస్తున్న బీఆర్ఎస్‌కేవీ నాయకులు

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన గూడ వెంకన్న ఇటీవల తాటిచెట్టు మీద నుంచి కిందపడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో ఆరోగ్య పరిస్థితి క్షీణించి మంచానికి పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌడుచర్ల సత్యనారాయణ ఆదివారం వెంకన్న నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాములు, గడ్డం సోమేశ్, రామ్మూర్తి, వెంకన్న పాల్గొన్నారు.

రంగనిగుడి ఆలయ ధర్మకర్త మృతి



రంగయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

కోదాడ : పట్టణంలోని అనంతగిరి రోడ్డులో గల గుంటిరఘునాధస్వామి (రంగనిగుడి) ఆలయ ధర్మకర్త గుడుగుంట్ల రంగయ్య (86) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నకుమారుడు, భార్య గతంలో మరణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సహకార సంఘాల జోనల్ అధికారిగా ఆయన పనిచేశారు. కాగా, ఆయన మృతదేహాన్ని పలువురు పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోదాడ వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.ఎస్.రావు మాట్లాడుతూ.. వంశ పారపర్యంగా రంగనిగుడి ఆలయ ధర్మకర్తగా ఉన్న రంగయ్య ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన మరణం తీరని లోటని అన్నారు.

ఆరు బయటే భోజనాలు



అనంతారం మోడల్ స్కూల్ బయట కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

తిరుమలగిరి(తుంగతుర్తి) : మండలంలోని అనంతారంలోని మోడల్ స్కూల్‌లో డైనింగ్ హాల్ లేక విద్యార్థులు ఆరు బయట భోజనం చేస్తున్నారు. ఆ పాఠశాలలో 664 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా లోనే ఉత్తమ పాఠశాలగా ఉంది. నాణ్యమైన విద్యా బోధన, సౌకర్యాలు ఉండడంతో పీఎం శ్రీ పథకానికి ఎంపికైంది. వర్షాకాలం, వేసవికాలంలో విద్యార్థులు ఎక్కడపడితే, అక్కడ కూర్చొని తింటున్నారు. ప్రతిరోజు మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థులకు డైనింగ్ హాల్ నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో ఇక్కట్లు



తిమ్మాపురం-సంగెం రహదారిపై రైతువేదిక ఎదుట ఏర్పడిన గుంతలు

అర్వపల్లి : తిమ్మాపురం-సంగెం ప్రధాన రహదారిపై తిమ్మాపురం గ్రామ శివారులో రైతువేదిక ఎదుట రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ రహదరిపై ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు నడుస్తుంటాయి. గుంతలను పూడ్చివేయించి రహదారిని మరమ్మతు చేయించి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి



డ్రెయినేజీ సమస్యపై కాలనీ వాసులతో మాట్లాడుతున్న సర్వోత్తమ్ రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలు, శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పోతు భాస్కర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 14వ వార్డు స్నేహ నగర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డితో కలిసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం శివారు ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోలేదని, రోడ్లు మురుగునీటి సమస్య నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. త్వరలోనే శివారు ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయడంతో పాటు తాత్కాలికంగా వీధుల్లో నీరు నిలువ లేకుండా చూస్తామని తెలిపారు. స్నేహ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం

తిరుమలగిరి(తుంగతుర్తి): గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. పురిటినొప్పులు ఎక్కువ కావడంతో 108 వాహనంలోనే సిబ్బంది ప్రసవం చేశారు. వివరాలు.. అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పడమటి సతీష్ భార్య కళ్యాణికి శనివారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కారులో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో నొప్పులు అధికమవ్వడంతో ఆశ వర్కర్ మంజుల 108 సిబ్బందికి సమాచారం అందించింది. తిరుమలగిరి నుంచి 108 సిబ్బంది అంజయ్య, సైదులు సంఘటన స్థలానికి చేరకుని వాహనంలోనే కళ్యాణిని సాధారణ కాన్పు చేయగా.. మగ బిడ్డ జన్మించాడు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని సూర్యాపేట జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ తరలించినట్లు తెలిపారు.

అంజన్న ఆశయ సాధనకు కృషిచేయాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

అర్వపల్లి : ప్రజా నాట్యమండలి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కారుపోతుల అంజన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనవిజ్ఞాన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటి రమేష్ కోరారు. అర్వపల్లిలో ఆదివారం పూలే-అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య ఆధ్వర్యంలో అంజన్న వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వీర పాపయ్య, రాష్ట్ర అధక్షుడు, న్యాయవాది నక్కల సురేందర్, మాజీ ఎంపీపీలు కొత్తగట్టు మల్లయ్య, జోగునూరి కరుణ, మాజీ జెడ్పీటీసీలు తాటి విజయమ్మ, జీడి భిక్షం, నాయకులు చేను శ్రీనివాస్, కడెం లింగయ్య, జోగునూరి సందర్ రావు, రాంప్రభు, బి.వెంకటమ్మ, నెమ్మాది రమణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



సూర్యాపేట అర్బన్ : మాట్లాడుతున్న గోవింద్

చివ్వెంల(సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి రెండేళ్ల అవుతున్న ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పాలన గాడి తప్పిందన్నారు. కేంద్ర నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. కనీసం పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రజలు అంటువ్యాధులు, విష జ్వరాల భారిన పడుతున్నారని ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఆమలు చేయాలని, ప్రజల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలగాని సోమయ్య, ఇట్టమళ్ల ఎసోబ్, స్టాలిన్, సులేమాన్ పాల్గొన్నారు.

'ప్రత్యేక' పాలనలో పేరుకుపోయిన సమస్యలు

సూర్యాపేట అర్బన్ : ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలు పెరిగిపోతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎల్గూరి గోవింద్ అన్నారు. ఆదివారం సీతారాంపురంలోని 25వ వార్డులో నిర్వహించిన ఆ పార్టీ వన్‌టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. షేక్ సైదులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్, పట్టణ కమిటీ సభ్యులు షేక్ జహంగీర్, మామిడి పుల్లయ్య, కప్పల సత్యం, భాగ్యమ్మ,వట్టే ఎర్రయ్య, శశిరేఖ, పిట్టల రాణి, జయమ్మ, ఎల్లమ్మ, నాయకులు మల్లయ్య, బుద్ధ సంతోష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

అర్వపల్లి : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరుతూ వైద్య సిబ్బంది ఆదివారం ఉయ్యాలవాడలో ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్‌లు కుంభం వీరయ్య, నాగరాణి, పంచాయతి కార్యదర్శి లింగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్యసిబ్బంది

విద్యార్థి పోరుబాటను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేట అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆగస్టు 25 నుంచి 31 వరకు నిర్వహించే విద్యార్థి పోరుబాటలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమగళం విప్పాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నియమించకుండా కాలయాపన చేస్తూ 500పైగా ఎంఈఓ, 28డీఈఓ పోస్టుల ఖాళీలల మూలాన క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసే అధికారులు లేరన్నారు. దీంతో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లల్లో నిత్యం విద్యార్థులు కల్తీ ఆహారంతో అస్వస్థకు గురవుతున్నారని వాపోయారు. అలాగే విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమనపల్లి ప్రకాష్, ఐతరాజు నవీన్, ఉత్తరాది నితిన్, పవన్, పేర్ల మనీషా పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25 నుంచి 31 వరకు నిర్వహించే విద్యార్థి పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఎర్ర అఖిల్ కుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో నిర్వహించిన ఆ సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో ప్రకాశ్, నవీన్, నితిన్, పవన్, మనిషా పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా సీఎంఆర్ఎఫ్



చెక్కులు పంపిణీ చేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి

అర్వపల్లి : ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి అన్నారు. భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్ సహకారంతో మండల పరిధిలోని తిమ్మాపురానికి చెందిన మేడబోయిన మానికశంకర్‌కు రూ.58 వేలు, భూపతి పూజాసతీష్‌కు రూ.15వేలు వైద్య ఖర్చుల కోసం సీఎం నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, బీరెల్లి శ్రీధర్‌రెడ్డి, జె.సోమయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పలయ్య, సంతోష్, ఉపేందర్, శ్రీనివాసరెడ్డి, లింగరాజు, సైదులు, శ్రీను, శంకర్, సంతోష్, కిరణ్ ఉన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో వైద్యశిబిరం ఏర్పాటు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థికి డెంగీ లక్షణాలు ఉండడంతో ఆదివారం మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిని మానిక హాస్టల్‌లోని విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎస్సీ హాస్టల్ పరిసరాలతో పాటు చుట్టుపక్కల మురుగు నిలిచి ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేసి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు అవసరమైన మందులను ఇవ్వడంతో పాటు రాత్రి సమయంలో కుట్టకుండా దోమతెరలు వాడాలని హాస్టల్ వార్డెన్ నరేష్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ యాదగిరి, రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశా కార్యకర్తలు నాగమ్మ మాధవి తదితరులు ఉన్నారు.

పాఠ్యాంశాల్లో యోగా విద్యను చేర్చాలి



గూడూరు నాగేశ్వర్‌రావు, దేశగాని ఉపేందర్‌లను సన్మానిస్తున్న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

సూర్యాపేట : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో యోగా విద్యను ప్రవేశ పెట్టి ఆరోగ్య భారతాన్ని నిర్మాణం చేయాలని ముఖ్య డాక్టర్ దాచేపల్లి సుధీర్‌కుమార్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ స్పందన డిగ్రీ కాలేజీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన గూడూరు నాగేశ్వర్ రావు, ఒక గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన దేశగాని ఉపేందర్ ను వారు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జె. శశిధర్, మాజీ కౌన్సిలర్ బండపెల్లి పాండు రాగాచారి, అసోసియేషన్ కమిటీ ఉపాధ్యక్షులు సైదులు, పీడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేశగాని శ్రీనివాస్, జుట్టుకొండ నవీన్, చంద్రశేఖర్, రంగారావు, బానుప్రకాష్, నాగిరెడ్డి,నగేష్, నామాల వీరయ్య, మల్లికార్జున్, భగవాన్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ ఐలయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : స్థానిక పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ నేర నియంత్రణ విభాగంలో, శాంతిభద్రత పరిరక్షణలో ఉత్తమంగా విధులు నిర్వర్తించినందుకు గాను ఇటీవల ఉత్తమ స్టేషన్ హౌస్ ఆఫీర్ (ఎస్‌హెచ్ఓ) ఐలయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఎస్ఐ ఐలయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు సుంకరి జనార్దన్, కన్నెబోయిన వెంకటబిక్షం, ఎల్మకంటి సోమన్న, గద్దల సైదులు, కొండ మల్లేష్, వడ్లకొండ వేణు, బుక్క శ్రీను, చిప్పలపల్లి సోమయ్య, అనంతుల వెంకటయ్య, చిప్పలపల్లి అంజయ్య, జేరిపోతుల సంపత్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై హర్షం

నూతనకల్ : వినాయక చవితి, దుర్గామాతల ఉత్సవాల మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందించడంపై ఉత్సవ కమిటీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయా గ్రామాలకు చెందిన మండప నిర్వాహకులు మాట్లాడుతూ పోలీసుల అనుమతి పొందిన మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందించడం సంతోషదాయకమన్నారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

సూర్యాపేట : వరంగల్‌లో ఆదివారం ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్రస్థాయి బహిరంగ సభకు అనుమతి ఇవ్వకుండా, ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఆ వేదిక జిల్లా కన్వీనర్ లింగంపల్లి భద్రయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు అనుమతి నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగం కల్పించిన పౌర, ప్రాథమిక హక్కులను కాలరాయడమే ప్రజా ప్రభుత్వమా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించి సభకు ఆటంకం కలిగించడంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలన్నారు. అక్రమంగా అరెస్టు చేసి, నిర్బంధించిన వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, యోగానందం, డేవిడ్ కుమార్, ఎం. సైదులు, మదార్, నాగయ్య, వెంకట్ యాదవ్, మాధవరెడ్డి, బుద్ధ సత్యనారాయణ, నర్సయ్య, పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులేవీ!



రహదారిపై కానరాని హెచ్చరిక బోర్డులు



- కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు
- సూచిక బోర్డులు లేక ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



తొండ బ్రిడ్జి వద్ద ప్రమాదానికి గురైన ఆటో(ఫైల్)

తిరుమలగిరి(తుంగతుర్తి) : తొర్రూర్ - వలిగొండ రహదారిపై రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో పాఠశాల సమీపంలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పనులు నత్త నడకనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ పనులు చేస్తున్నప్పుడు వాహనదారులు, ప్రయాణికులు రాకుండా హెచ్చరిక బోర్డులు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. అలాగే ప్రమాదాలు జరగకుండా రాత్రి సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం అనుకుంటే పనులు జరిగే చోట ముందు వాహనాలు రాకుండా రోడ్ బ్లాక్ చేయాలి. కాంట్రాక్టర్ నామమాత్రంగా ఎలాంటి హెచ్చరిక బోర్డు పెట్టకపోవడంతో గురువారం రాత్రి మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం భార్యా, భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ వెళ్తుండగా రోడ్డు ఎటువైపు వెళ్లాలో సరిగా తెలియకపోవడంతో వేగంగా వచ్చి ఆ బ్రిడ్జిలో ఆటో పడిపోయింది. దీంతో మహిళకు తీవ్రగాయాలయ్యాయి, భర్త, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. బ్రిడ్జి వద్ద అధికారులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, ప్రమాదం చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు వేగంగా కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలని, బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రీన్ వాక్



గ్రీన్ వాక్ నిర్వహిస్తున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

సూర్యాపేట అర్బన్ : ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు వద్దు బంక మట్టి విగ్రహాలే ముద్దు అనే నినాదంతో శంకర్ విలాస్ సెంటర్ నుంచి వాణిజ్య భవన్ నల్లాల బావి పొట్టి శ్రీరాములు సెంటర్ పూల సెంటర్ కూరగాయల మార్కెట్ మీదుగా బ్రాహ్మణపల్లి శివ గ్రీన్ వాక్ వాక్ నిర్వహించారు. సభ్యులు దారి వెంట కరపత్రాలు పంచుతూ స్టిక్కర్లు అంటిస్తూ బంక మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు ముప్పారపు నరేందర్, డాక్టర్ తోట కిరణ్, మిర్యాల వెంకటేశ్వర్లు, గుండా కిరణ్, మాడిశెట్టి శ్రీనివాస్, సోమా హేమాలిని, మంచాల శ్యామ్, రావిరాల సురేందర్, దారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

మృతుడి కుటుంబానికి పరామర్శ

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ఖమ్మంపాటి రామలింగం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని పలువురు సీపీఐ నాయకులు సందర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

కోదాడ : అన్నిదానాల కన్నా రక్తదానం గొప్పదని రాజయోగి బ్రహ్మకుమారీ త్రివేణి అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయ మాజీ పరిపాలన అధిపతి దాది ప్రకాశ్‌మణి 18వ స్మృతి దినోత్సవం సందర్భంగా ఆదివారం కోదాడలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివేణి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలబెట్టే ఆప్తులు రక్తదాతలన్నారు. ఈ శిబిరంలో 29 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల వైద్యశాల నిర్వాహకురాలు డాక్టర్ ప్రమీల, బ్రహ్మకుమారీలు లక్ష్మి, జ్యోతి, సేవకులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

కోదాడరూరల్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 31 కోదాడలో నిర్వహిస్తున్న మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలో మందకృష్ణ మాదిగ పాల్గొననున్నట్లు తెలిపారు.